సాక్షి పెద్దపల్లి

మంగళవారం । 11 । జూలై । 2023



రాజన్నకు మొక్కులు

వేములవాడ: రాజన్నను సోమవారం 15 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. మహారాష్ట్ర నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.



సురక్షిత పనివిధానం మేలు

గోదావరిఖని: సురక్షిత పని విధానం పాటించాలని కార్పొరేట్ సేఫ్టీ జీఎం గురువయ్య సూచించారు. ఆర్జీ-1 ఏరియా జీడీకే-2, 2ఏ గనిపై రక్షణ చర్యలపై అవగాహన కల్పించారు.

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం

34.0/26.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో చిరుజల్లులు, మరికొన్ని చోట్ల మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

వసతుల కల్పనకు ప్రాధాన్యం



డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ మమతారెడ్డి

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మున్సిపాలిటీ ప్రజలకు మౌలిక వసతులు కల్పించడమే ధ్యేయంగా పనులు చేపడుతున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ దాసరి మమతారెడ్డి సూచించారు. మున్సిపల్ పరిధిలోని 23వ వార్డులో రూ.2.5లక్షలతో చేపట్టిన డ్రైనేజీ పనులను సోమవారం ప్రారంభించారు. పట్టణాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసేందుకు ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి సంపూర్ణ సహకారం అందిస్తున్నారని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ మట్ట శ్రీనివాస్‌రెడ్డి, కౌన్సిలర్లు తాడూరి పుష్పలత, తూముల సుభాష్‌రావు, పెంచాల రమాదేవి, ఏఈ సతీష్, వర్క్ ఇన్స్పెక్టర్ అనిల్ కుమార్, అల్కా జవాన్ జయరాజ్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌కు ఫీడ్‌బ్యాక్ ఇవ్వండి

కోల్‌సిటీ(రామగుండం): స్వచ్ఛసర్వేక్షణ్-2023 పోటీలో రామగుండం బల్దియా మరోసారి బరిలో దిగింది. ఈ పోటీలో మెరుగైన ర్యాంక్ సాధించడానికి పౌరుల స్పందన కూడా కీలకం కానుంది. వారు ఇచ్చే స్పందనకూ మార్కులు కేటాయించనున్నారు. ఈ మంచి ఫీడ్‌బ్యాక్ ఇవ్వాలని మేయర్ బంగి అనిల్ కుమార్, డిప్యూటీ కమిషనర్ నారాయణరావు నగర ప్రజలను కోరారు. https//sbmurban.org/feedback వెబ్‌సైట్‌లో మొబైల్ నెంబర్ నమోదు చేసి, ఓటీపీతో లాగిన్ అయ్యాక, వివరాలు నమోదు చేయాలని, అందులో వచ్చిన నాలుగు ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలని కోరారు.

వైద్య కళాశాలలో సీట్లకు దరఖాస్తు చేసుకోండి

గోదావరిఖని: సింగరేణి మెడికల్ కళాశాల (సిమ్స్)లో సీట్ల కోసం ఉద్యోగుల పిల్లలు దరఖాస్తు చేసుకోవాలని సింగరేణి డైరెక్టర్(పా) బలరాం సూచించారు. సింగరేణి ఉద్యోగుల పిల్లలకు 5 శాతం రిజర్వేషన్ కోటా కింద ఏడు సీట్లు కేటాయించారని, వీటికి ఈనెల 14లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. సీట్లను జాతీయ స్థాయి 'నీట్' (నేషనల్ ఎలిజిబిలిటీ ఎంట్రన్స్ టెస్ట్)లో వచ్చిన ర్యాంకు ఆధారంగా ఎంపిక చేస్తారని, ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్ వర్తింపజేస్తూ కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ సీట్లు కేటాయిస్తుందని తెలిపారు. ఉద్యోగుల పిల్లలు, తల్లి లేదా తండ్రి పని చేస్తున్న గని, విభాగం అధిపతుల నుంచి ధృవీకరణ పత్రం తీసుకొని సమర్పించాలన్నారు.

నల్లచీరలు ధరించి అంగన్‌వాడీల నిరసన



పెద్దపల్లిరూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని, బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలని అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు కలెక్టరేట్ ఎదుట నల్లరంగు చీరలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ నుంచి కలెక్టరేట్ వరకు పాదయాత్ర చేశారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏటా నిధులు తగ్గిస్తోందని సంఘం జిల్లా అధ్యక్షుడు కుమారస్వామి, ప్రధాన కార్యదర్శి జ్యోతి ఆరోపించారు. ఐసీడీఎస్‌ను నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతోందని, అందుకే నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకొచ్చిందని పేర్కొన్నారు. అనంతరం కలెక్టర్ సంగీతకు వినతి పత్రం అందించారు. వనజారాణి, కమలేశ్, రామలక్ష్మి, శోభ, సుగుణ, హరిత, హేమలత, స్వరూప, భాగ్య, సుగుణ, భాగ్య లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ అవార్డులకు 15లోపు దరఖాస్తు చేసుకోండి

పెద్దపల్లిరూరల్: ఈ విద్యాసంవత్సరంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కోసం ఆసక్తి గల ఉపాధ్యాయులు ఈనెల 15లోపు దరఖాస్తులు సమర్పించాలని డీఈవో డి.మాధవి సూచించారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల ప్రధానోపాధ్యాయులు ఆన్‌లైన్‌లో పేర్లను నమోదు చేసుకోవాలని, సంబంధిత ధ్రువపత్రాలను డీఈవో కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు.

పెద్దపల్లిలో బీసీ నినాదం



- అసెంబ్లీ బరిలో నిలిచేందుకు నేతల ప్రయత్నాలు
- బీసీలకు టికెట్లు ఇవ్వాలని అన్ని పార్టీల్లోనూ డిమాండ్
- 'బీసీ ఎమ్మెల్యే' పేరిట పార్టీలకు అతీతంగా ఏకమవుతున్న లీడర్లు

సాక్షి, పెద్దపల్లి: జనాభా దమాషాపరంగా సమాజంలో సగానికి పైగా ఉన్నా.. ఇన్నాళ్లు రాజకీయంగా న్యాయం జరగలేదని, అందివచ్చిన అవకాశాలను ఉపయోగించుకుని ఉన్నత విద్యాభ్యాసం చేసిన యువకులు.. ఆర్థికంగా బలపడిన నాయకుల్లో తమ సామాజిక వర్గం బీసీలకు సమ ప్రాధాన్యం దక్కాలన్న డిమాండ్ బలంగా వినిపిస్తోంది. ముఖ్యంగా బీసీ ఓటర్లు గణనీయంగా ఉన్న పెద్దపల్లి నియోజకవర్గంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచేందుకు బీసీ నేతలు గట్టిగానే ప్రయత్నాలు చేస్తున్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, బీఎస్పీల నుంచి టికెట్లు ఆశిస్తున్నారు. 'బీసీ ఎమ్మెల్యే' అంటూ బీసీవాదం నియోజకవర్గంలో బలపడుతుండటం రాజకీయంగా చర్చనీయాంశంగా మారుతోంది. నియోజకవర్గంలో మెజార్టీ ఓటర్లు బీసీలే ఉన్నప్పటికీ.. సరైన రాజకీయ ప్రాధాన్యం దక్కడంలేదన్న అసంతృప్తి వారిలో ఉంది. దీంతో ఈసారైనా బీసీ ఎమ్మెల్యేను ఎన్నుకునేందుకు పార్టీలకతీతంగా నాయకులు సమావేశాలు పెట్టుకుంటున్నారు. ఆయా పార్టీల నుంచి బీసీలకు టికెట్ ఇస్తే గెలిపిస్తామని, కాదనే పార్టీల అభ్యర్థులను ఓడించి తీరుతామని తేల్చి చెబుతున్నారు.

ఏడుసార్లు టికెట్.. ఇద్దరు గెలుపు

1952 నుంచి పెద్దపల్లి శాసనసభకు ఇప్పటివరకు 15 సార్లు అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించగా.. ఇందులో ఏడు సార్లు బీసీ అభ్యర్థులకు టికెట్ లభించింది. అయితే ఇద్దరు మాత్రమే ముత్తయ్య, బిరుదు రాజమల్లు బీసీ అభ్యర్థులుగా విజయం సాధించారు. ఒకసారి ఎస్సీ, మిగిలిన సార్లు రెడ్డి, వెలమ సామాజికవర్గానికి చెందిన వారే ఎన్నికయ్యారు. స్థానికంగా బీసీ ఓటర్లు కీలకంగా ఉన్నప్పటికీ రెండు సామాజిక వర్గాల నాయకులే ఎన్నికవ్వడంపై బీసీ నాయకులు గుర్రుగా ఉన్నారు. పార్టీలకతీతంగా బీసీ ఎమ్మెల్యేను గెలిపించుకునేందుకు ఏకమవుతున్నారు.

ప్రతిపక్ష పార్టీల్లోనూ బీసీల దూకుడు

అన్ని పార్టీలతో పోల్చి చూస్తే బీఎస్పీ నుంచి దాసరి ఉష అసెంబ్లీ బరిలో నిలవనున్నారు. అందుకు తగ్గట్టుగానే ఇంటింటికీ దాసరి ఉష కార్యక్రమంతో ప్రజలతో మమేకమవుతున్నారు. కాంగ్రెస్ నుంచి గంట రాములు బీసీ కోటాలో టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నా.. మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు ఇంటింటికీ విజ్జన్న పేరుతో ప్రచారంలో దూసుకెళ్తున్నారు. గతంలో రేవంత్‌రెడ్డి పెద్దపల్లికి వచ్చిన సందర్భంలోనే కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా విజయరమణారావును ప్రకటించారు. ఇటీవల జిల్లానుంచి సాగిన భట్టి విక్రమార్క పాదయాత్రను విజయవంతం చేసి తన ప్రజాబలాన్ని నిరూపించుకున్నారు విజయ్. ఈనేపథ్యంలో రేవంత్‌తోపాటు భట్టి సైతం విజయరమణారావుకు టికెట్‌పై గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. అయితే గంట రాములు ఉదయ్‌పూర్ డిక్లరేషన్, కర్నాటక తదితర రాష్ట్రాల్లో ప్రతి లోక్‌సభ పరిధిలో ఇద్దరు బీసీలకు టికెట్ ఇస్తారని, ఆ కోటాలో టికెట్ కోసం తనవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. బీజేపీ నుంచి ఏగోలపు సదయ్యగౌడ్ బీసీ నినాదంతో ముందుకుసాగుతున్నారు.

బీఆర్ఎస్ టికెట్ రేసులో 'బొద్దుల'

రాష్ట్రంలో 12 శాతానికి పైగా ఉన్న పద్మశాలీల సామాజికవర్గం నుంచి అధికార పార్టీ బీఆర్ఎస్‌లో ఎమ్మెల్సీ ఎల్.రమణ మినహా మరెవరికీ ప్రాతినిధ్యం లేదు. రాష్ట్రవ్యాప్తంగా ఈసారి పద్మశాలీలకు రెండు నుంచి మూడు టికెట్లు ఇవ్వాలని పద్మశాలీసంఘం నేతలు ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఒత్తిడి తెస్తున్నారు. ఈ నేపథ్యంలో పెద్దపల్లిలో సుమారు 30 వేలకుపైగా పద్మశాలీ ఓట్లు ఉన్నాయని, తనకు టికెట్ కేటాయిస్తే గెలుపు తథ్యమని బీఆర్ఎస్ తరపున జిల్లాలోని జూలపల్లి జెడ్పీటీసీ బొద్దుల లక్ష్మణ్ కోరుతున్నారు. బీసీ కోటాలో బరిలో నిలిచేందుకు ఆయన ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. కేసీఆర్ సేవాదళం పేరిట తన కార్యకలాపాలు కొనసాగిస్తూ గ్రామీణప్రాంతాల్లో క్రీడలను ప్రోత్సహిస్తూ పార్టీలైన్ దాటకుండానే ప్రయత్నాలు చేస్తున్నారు. సర్వేల్లో సైతం తనకు మద్దతు లభిస్తోందని, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, సర్పంచ్‌లు, ముఖ్యనేతలను కలుస్తూ మార్పు అనివార్యమైనప్పుడు సహకారం అందించాలని కోరుతున్నారు. విద్యార్థి ఉద్యమ నాయకుడు, కేటీఆర్ సన్నిహితుడైన టీఎస్‌టీఎస్ మాజీ చైర్మన్ చిరుమళ్ల రాకేష్ సైతం టికెట్ కోసం తనవంతు ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు సిట్టింగ్‌కే టికెట్ అంటూ ఎమ్మెల్యే దాసరి మనోహారెడ్డి ముచ్చటగా మూడోసారి గెలిచి హ్యాట్రిక్ కొట్టేందుకు కార్యకర్తలు, ప్రజలతో మమేకమవుతూ సిద్ధమవుతున్నారు.

నోట్‌బుక్కులు రాలె!

- ఈ ఏడాది విద్యార్థులకు నోటుబుక్కులు ఉచితం
- 6-12 తరగతులకు నిధులు మంజూరు చేసిన ప్రభుత్వం
- ట్రాన్స్‌పోర్టు కోసం కూడా విడుదలైన డబ్బులు
- ఉమ్మడి జిల్లాలో ఏ పాఠశాలకూ అందని నోట్‌బుక్కులు
- సమీపిస్తున్న ఫార్మాటివ్ అసెస్‌మెంట్ పరీక్షలు



జిల్లా	అందాల్సిన నోట్‌బుక్కులు
కరీంనగర్	2,66,121
జగిత్యాల	3,88,730
పెద్దపల్లి	2,10,618
రాజన్న సిరిసిల్ల	2,41,712

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: ప్రభుత్వం ఈఏడాది విద్యార్థుల కోసం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఉచిత నోట్‌బుక్కుల పంపిణీ ఇంకా అమలుకు నోచుకోలేదు. తెలంగాణ సమగ్రశిక్ష కింద.. ఆరో తరగతి నుంచి 12వ తరగతి వరకు అన్ని ప్రభుత్వ, స్థానిక సంస్థల, కేజీబీవీ, గురుకుల, మోడల్ స్కూళ్లలో అందజేసేందుకు ఏర్పాట్లు చేసేందుకు సిద్ధపడింది. సాధారణంగా ప్రభుత్వం నుంచి సహకారం లేకపోవడం, నిధులు విడుదల కాకపోవడం, క్షేత్రస్థాయిలో అధికారుల నిర్లక్ష్యం తదితర కారణాలతో ప్రభుత్వ పథకాలు అమలుకు నోచుకోవు. కానీ.. విచిత్రంగా ఈ విషయంలో మాత్రం ప్రభుత్వం నుంచి నిధుల కేటాయింపు పూర్తయింది. అంతేకాదు నోటుబుక్కులు రాష్ట్రంలోని అన్ని జిల్లాల పాఠశాలలను చేరేందుకు కావాల్సిన రవాణాచార్జీలు కూడా కేటాయించింది. అయినప్పటికీ నేటికీ అందకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

సమీపిస్తున్న ఫార్మాటివ్ అసెస్‌మెంట్..

వాస్తవానికి ఈవిద్యా సంవత్సరం 2023-24లో భాగంగా గతనెల జూన్ 2వ తేదీ నుంచి సర్కారు పాఠశాలల్లో ప్రవేశాలు మొదలయ్యాయి. తొలిపది రోజులు తెలంగాణ దశాబ్ది వేడుకలే జరిగాయి. అనంతరం పాఠ్యపుస్తకాలు కూడా పాఠశాలలకు చేరుకోవడంతో ఉపాధ్యాయులు పాఠాలు మొదలుపెట్టారు. ఈ ఏడాది నోటుబుక్కులు కొనుక్కోనవసరం లేదని అన్ని స్కూళ్లలో ముందే విద్యార్థులకు చెప్పడంతో వారంతా కొనలేదు. కానీ.. హైస్కూల్ విద్యార్థులకు ముఖ్యంగా 10వ తరగతి విద్యార్థులకు నోటు బుక్కులు చాలా కీలకం. అందులోనూ ఫార్మాటివ్ అసెస్‌మెంట్-1 పరీక్షలు త్వరలో జరగనున్నాయి. ఈ నేపథ్యంలో టీచర్లు బోధించిన పాఠాలు రాసుకునేందుకు చాలామంది నోట్‌బుక్కులు కరవయ్యాయి. వాస్తవానికి నోట్‌బుక్కుల్లో జాప్యంతో ఇప్పటికే కొన్నిచోట్ల విద్యార్థులు కొనుక్కుని వస్తున్నారు. అదేసమయంలో పేద విద్యార్థులు మాత్రం ప్రభుత్వంపై ఆశతో ఉన్నారు.

ఏ విద్యార్థికి ఎన్నినోట్ బుక్కులు..?

ప్రతి హైస్కూల్ విద్యార్థికి తరగతి గదిలో చెప్పే పాఠాలను నోట్ చేసేకునేందుకు 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు అందరికీ ఉచిత 200 పేజీల నోట్‌బుక్కులు ఈవిద్యా సంవత్సరం నుంచి ×తెలంగాణ సమగ్ర శిక్ష౹ కింద ఇచ్చేందుకు విద్యాశాఖ రంగం సిద్ధం చేసింది. ఇప్పటికే ఈ మేరకు 33 జిల్లాల విద్యాశాఖాధికారు (డీఈవో)లకు సమాచారాన్ని గత జూన్ 6వ తేదీన చేరవేసింది. 6వ, 7వ తరగతి విద్యార్థులకు 6 నోట్‌బుక్కుల చొప్పున, 8వ తరగతికి 7 బుక్కులు, 9వ, 10వ తరగతులకి 14 నోట్ బుక్కులు, 11వ, 12వ తరగతులు (ఎంపీసీ, సీఈసీ, బైపీసీ తదితరాలు) 12 నోట్‌బుక్కులు ఇవ్వాలని స్కూల్ ఎడ్యుకేషన్, డైరెక్టర్ వెల్లడించారు. 33 జిల్లాల డీఈవోలు ఈ నోట్‌బుక్కులను అన్ని మండలాలకు పంపాలని, అక్కడి నుంచి ఎంఈవోలు పాఠశాలలకు తరలించాలని సూచించారు. ఈ క్రమంలో ఎక్కడ నోట్‌బుక్కుల కొరత ఏర్పడినా ఉన్నతాధికారులకు వెంటనే తెలియజేయాలని స్పష్టంచేశారు.

నిధులు విడుదలైనా..

నోట్‌బుక్కుల రవాణా కింద ప్రతీ పాఠశాలకు నిధులు కేటాయించింది. జిల్లాకు రూ.2 లక్షల చొప్పున ఇస్తూ ఆదేశాలు జారీచేసింది. ఇందులో రూ.48,000 ఎస్సీ, రూ.28,000 ఎస్టీ కంపోనెంట్లుగా మిగిలిన రూ.1,24,000 జనరల్ కంపోనెంట్‌గా పేర్కొంది. ఈలెక్కన ఉమ్మడి జిల్లాకు రవాణా కింద రూ.8 లక్షలు వస్తాయన్నమాట. అయితే, ఆదేశాలు వచ్చినప్పటికీ.. ఇంకా ఈ నోట్‌బుక్కులు జిల్లాలకు చేరుకోకపోవడంతో డీఈవోలు, ఎంఈవోలు, హెడ్మాస్టర్లు విద్యార్థులకు ఏమీ చెప్పలేకపోతున్నారు.

జిల్లా	పాఠశాలలు	ఉపాధ్యాయులు	విద్యార్థులు
కరీంనగర్	623	2,787	36,775
జగిత్యాల	748	3,915	65,632
పెద్దపల్లి	580	2,423	45,626
రాజన్న సిరిసిల్ల	510	2,651	37,803

(నోట్: ఈ గణాంకాలకు గురుకుల, కేజీబీవీ, మోడల్ స్కూళ్లు అదనం)



'భృతి' చెల్లించడంలో కేసీఆర్ విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న శివసేనారెడ్డి

గోదావరిఖని: నిరుద్యోగులకు భృతి చెల్లించడంలో సీఎం కేసీఆర్ విఫలమయ్యారని యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేనారెడ్డి తెలిపారు. సోమవారమిక్కడ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 1.07లక్షల ఉద్యోగాలు మూడు నెలల్లో భర్తీ చేస్తామని 2014లో కేసీఆర్ ప్రకటించారని గుర్తు చేశారు. నిరుద్యోగుల సంఖ్యలో రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ వైఖరితో 700 మందికి పైగా నిరుద్యోగులు ఆత్మహత్య చేసుకున్నారని, సొంత రాష్ట్రంలో ఉద్యోగాలు రాకుంటే తెలంగాణ ఎందుకోసమని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే నిరుద్యోగులకు ప్రతినెలా రూ.4వేల భృతి ఇస్తామని స్పష్టం చేశారు. అలాగే రూ.10లక్షల వరకు వడ్డీలేని రుణం, క్రీడా విశ్వవిద్యాలయం ఏర్పాటు, ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల, అమరుల కుటుంబాలకు ప్రతినెలా రూ.25వేలు పింఛన్ చెల్లిస్తామన్నారు.

డబ్బులు చెల్లించకుంటే ముట్టడించుడే..

ఆర్ఎఫ్‌సీఎల్ ఉద్యోగాల పేరుతో తీసుకున్న డబ్బులు బాధితులకు నెలరోజుల్లో చెల్లించాలని, లేకుంటే రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌ను ఎక్కడికక్కడ అడ్డుకుంటామని శివసేనారెడ్డి తెలిపారు. హైదరాబాద్ వెళ్లినా వెంటపడతామన్నారు. బూడిదను కూడా అమ్ముకుంటున్న చరిత్ర ఎమ్మెల్యే చందర్‌కే దక్కిందన్నారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్.రాజ్‌ఠాగూర్, నాయకులు మహంకాళి స్వామి, నజీముద్దీన్, కొతం సతీష్, పెద్దెల్లి తేజస్విని, ముస్తాఫా పాల్గొన్నారు.



అగ్నిగుండంలో నడుస్తున్న భక్తులు



చికిత్సపొందుతున్న అగ్గిమల్లు

వైభవంగా మల్లన్న అగ్నిగుండాలు

ఓదెల: ఓదెల మల్లన్నస్వామి ఆలయంలో అగ్నిగుండ మహోత్సవం వైభవంగా జరిగింది. సోమవారం వేకువజామున ఆలయ ప్రధాన అర్చకులు దూపం వీరభద్రయ్య, మఠం భద్రయ్య ఆధ్వర్యంలో భక్తులు అగ్నిగుండంలో నడిచారు. ఆదివారం అర్ధరాత్రి పెద్దపట్నం కార్యక్రంలో ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ ఈవో సదయ్య, జూనియర్ అసిస్టెంట్ ముద్దసాని కుమారస్వామి, పాలకవర్గసభ్యులు పర్యవేక్షించారు. ఉత్సవాలు ముగియడంతో భక్తులు కోనేరులో స్నానాలు చేసి ఇంటిముఖం పట్టారు. ఎంపీపీ కునారపు రేణుకాదేవి, మాజీ ఎంపీపీ బుద్దె రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

అగ్నిగుండాలులో అపశ్రుతి

మంథని మండలం ఎగ్లాస్‌పూర్‌కు చెందిన అగ్గిమల్లుకు అకస్మాత్తుగా పూనకం రావటంతో అగ్నిగుండంలోనే పడిపోయాడు. ఈ ఘటనలో కాళ్లుచేతులకు గాయాలయ్యాయి. అప్రమత్తమైన పొత్కపల్లి పోలీసులు అగ్గిమల్లును బయటకు లాగి 108లో పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రజావాణికి బాధితుల తాకిడి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్, అదనపుకలెక్టర్

- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ సంగీత
- సమస్యలు పరిష్కరించాలని ఆదేశం

హద్దులు చూపించండి

పాలకుర్తి మండలం ఈసాలతక్కల్లపల్లి శివారులో ఇళ్లులేని పేదలకు నివేశన పట్టాలిచ్చిన అధికారులు హద్దులు చూపించలేదు. కేటాయించిన భూమిలో ఇళ్లు నిర్మించుకుందామంటే కొందరు బెదిరిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చిన పట్టాల ప్రకారం హద్దులు చూపి ఇళ్లు నిర్మించుకునేందుకు సహకరించాలి.



– ఈసాలతక్కల్లపల్లి వాసులు

కలెక్టరేట్ వద్ద బస్ షెల్టర్ నిర్మించండి



కలెక్టరేట్ బస్‌స్టాప్ వద్ద ఇరువైపులా బస్‌షెల్టర్లు నిర్మించేలా చర్యలు తీసుకోవాలి. జిల్లాలోని అన్నిప్రాంతాల నుంచి పనుల నిమిత్తం వచ్చే ప్రజలు, అధికారులు బస్సుల కోసం ఎండ, వానలో నిరీక్షించాల్సి వస్తోంది. వీలైనంత త్వరగా బస్‌షెల్టర్ నిర్మించాలి.

– కనుకుంట్ల సదానందం, పెద్దపల్లి

పంచాయతీ కార్యదర్శిపై చర్య తీసుకోండి



బ్రాహ్మణపల్లి కార్యదర్శి కిరణ్ పంచాయతీ నిధులను దుర్వినియోగం చేస్తున్నాడు. ఆయనపై విచారణ జరిపి చర్యలు తీసుకోండి. బిల్లుల వివరాలు అడిగితే సంతకం పెట్టాలని ఒత్తిడి చేస్తున్నాడు. సంతకం చేయలేదనే అక్కసుతో ప్రత్యేకంగా గ్రామసభ ఏర్పాటు చేసి నా పరువుకు భంగం కలిగించాడు.

– ఓదెల రాజు, ఉపసర్పంచ్ బ్రాహ్మణపల్లి

పెద్దపల్లిరూరల్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా బాధితులు తరలివచ్చారు. వారి నుంచి కలెక్టర్ సంగీత, అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, కుమార్ దీపక్ అర్జీలు స్వీకరించారు. ప్రజావాణిలో అందిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మొత్తంగా 46 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. రామగిరి మండలం లద్నాపూర్ అంగన్‌వాడీ టీచర్ అమర్యాదగా మాట్లాడుతున్నారని, అర్హులకు సరుకులు ఇవ్వడం లేదని గ్రామానికి చెందిన ఈర్ల పవన్ ఫిర్యాదు చేశారు. సుల్తానాబాద్ మండలం పూసాలలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని వితంతువు అనంతుల అక్షర అభ్యర్థించారు. తన భర్త రమేశ్ అనారోగ్యంతో మరణించాడని, కుటుంబపోషణ ఇబ్బందిగా మారిందని, షాపు ఇప్పించాలని కోరారు. రంగంపల్లిలోని ఇనాం భూమిని కబ్జా చేశారని, విచారణ జరిపి ఇప్పించాలని రంగంపల్లికి చెందిన కె.ఓదవ్వ కుటుంబ సభ్యులు కోరారు. సమస్యపై విచారణ జరిపి ఈ20లోగా నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.

నిరంకుశ పాలనపై తిరగబడాలి



సుద్దాలలో గ్రామస్తులతో విజయరమణారావు

సుల్తానాబాద్ రూరల్: రాష్ట్రంలో నిరంకుశపాలనపై ప్రజలు తిరగబడాలని మాజీ ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. మండలంలోని సుద్దాలలో గడపగడపకూ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాన్ని సోమవారం చేపట్టారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ వైఖరిని వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే పేదలు ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.5లక్షల సాయం చేస్తామని, రూ.500కే గ్యాస్ సిలిండర్, ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ, ని రుద్యోగ భృతి కింద రూ.4వేలు అందిస్తామన్నారు. నాయకులు ప్రకాశ్‌రావు, అంతటి అన్నయ్యగౌడ్, చిలుక సతీశ్, అబ్బయ్యగౌడ్, దయోదర్‌రావు, మహేందర్, అక్బర్‌అలీ, కుమార్, వెంకటేష్ తదితరులున్నారు.

మైనార్టీల సంక్షేమాన్ని మరచిన బీఆర్ఎస్

పెద్దపల్లిరూరల్: మైనార్టీలకు సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని విజయరమణారావు ఆరోపించారు. జిల్లాకేంద్రంలో మాట్లాడారు. మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని మోసం చేశారని పేర్కొన్నారు. అస్లాంతోపాటు నియస్ ఖురేషీ, అమీర్, సాజీద్, ఫిరోజ్, జాకీర్, అస్మా, సాహిర, అనూరి, రజియా, శ్రావణి తదితరులు కాంగ్రెస్‌లో చేరగా.. కండువాలు కప్పి ఆహ్వానించారు.

క్లుప్తంగా

బడుగులందరూ ఏకం కావాలి



కండువా కప్పుతున్న హనుమయ్య

పెద్దపల్లిరూరల్: బడుగు బలహీనవర్గాల వారందరూ ఏకమై, వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు బుద్ధి చెప్పాలని బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి దాసరి హనుమయ్య పిలుపునిచ్చారు. పెద్దపల్లిలోని పార్టీ ఆఫీసులో సోమవారం సమావేశం నిర్వహించారు. కాల్వశ్రీరాంపూర్ మండలంలోని మడిపల్లి కాలనీకి చెందిన యువకులు బీఎస్పీలో చేరగా కండువాలు కప్పి, ఆహ్వానించారు. బడుగు బలహీన వర్గాలకు అండగా బీఎస్పీ మాత్రమే ఉంటుందని ప్రజలు గ్రహించారన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలతో పేదలకు ఒరిగిందేమీ లేదని పేర్కొన్నారు. నాయకులు విజయ్, సంజయ్, జిల్లా ఇన్‌చార్జి చంద్రశేఖర్, వెంకటేశ్, రవికుమార్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

చేతులు తడిపిన వారికే డెప్యుటేషన్

- హెచ్ంఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్అహ్మద్



మాట్లాడుతున్న రియాజ్అహ్మద్

గోదావరిఖని: డెప్యుటేషన్ పేరిట యువ కార్మికుల నుంచి అధికారులు, గుర్తింపు సంఘం నాయకులు రూ.కోట్లు దండుకుంటున్నారని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్అహ్మద్ ఆరోపించారు. సోమవారం గోదావరిఖనిలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిబంధనలు తుంగలో తొక్కి, చేతులు తడిపిన వారికే డెప్యుటేషన్ ఇస్తున్నారని అన్నారు. ఈ విషయమై డైరెక్టర్(పా) విజిలెన్స్ విచారణకు ఆదేశించాలని కోరారు. ఒక్కో కార్మికుడి మూడు నెలల జీతం డెప్యుటేషన్ దందాకే పోతోందన్నారు. సింగరేణి వ్యాప్తంగా 1,904 మంది డెప్యుటేషన్‌పై కొనసాగుతున్నారని తెలిపారు. వీరిని వెంటనే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అండర్‌గ్రౌండ్‌లో అన్‌ఫిట్ అయితే సర్ఫేజ్‌లో సేమ్ జాబ్ ఇవ్వకుండా అధికారులు ఇబ్బంది పెడుతున్నారని పేర్కొన్నారు. ఈ పద్ధతి మానుకోవాలన్నారు. చాలామంది కార్మికులకు ఇన్‌కంట్యాక్ చెల్లించాలని నోటీసులు వచ్చాయని, దీనికి యాజమాన్యమే బాధ్యత వహించాలన్నారు. త్వరలో నిర్వహించే సేఫ్టీ త్రైపార్టైడ్ సమావేశానికి అన్ని సంఘాలను పిలవాలని కోరారు. నాయకులు ఉమామహేశ్వర్, అక్బర్‌పాషా, రాజలింగయ్య, రాంచందర్, రాజేశ్, స్వామి, మధుసూదన్, లక్ష్మయ్య, ప్రదీప్, సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలల జిల్లాస్థాయి పోటీలు



మెడిసన్ బాల్ త్రో పోటీని పరిశీలిస్తున్న డీవైఎస్‌వో రాజవీరు తదితరులు

కరీంనగర్‌స్పోర్ట్స్: రాష్ట్రంలోని ప్రాంతీయ క్రీడా పాఠశాలల్లో 2023–24 విద్యాసంవత్సరంలో 4వ, 5వ తరగతుల్లో ప్రవేశానికి నిర్వహిస్తున్న జిల్లా స్థాయి ఎంపిక పోటీలు సోమవారం కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. 4వ తరగతిలో ప్రవేశం కోసం విద్యార్థులకు శారీరక సామర్థ్య పరీక్షలు నిర్వహించారు. అంతకుముందు ఈ పోటీలను జిల్లా క్రీడా శాఖ అధికారి కీర్తి రాజవీరు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 16 మండలాల నుంచి 40 మంది బాలబాలికలు హాజరైనట్లు తెలిపారు. జిల్లాస్థాయిలో అత్యధిక పాయింట్లు సాధించిన విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీలకు పంపించనున్నట్లు పేర్కొన్నారు. అనివార్య కారణాల వల్ల హాజరు కాలేకపోయిన విద్యార్థులు మంగళవారం రావొచ్చని చెప్పారు. పీడీలు రాజిరెడ్డి, నర్సయ్య, అంతడ్పుల శ్రీనివాస్, ఎండీ.యూనిస్ పాషా, కొమురోజు కృష్ణ, హన్మంతు, జిట్టబోయిన శ్రీనివాస్, 36 మంది పీఈటీలు పాల్గొన్నారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి



ప్రియాంశ్ (ఫైల్)

పెద్దపల్లిరూరల్: ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఓ యువకుడు రైలు నుంచి పడి మృతిచెందాడు. వివరాల్లోకి వెళ్తే.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని అంబేడ్కర్‌నగర్ జిల్లా రాంనగర్‌కు చెందిన ప్రియాంశ్(19) కూలి పనులు చేసేందుకు కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరుకు సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్‌లో బయల్దేరాడు. మార్గమధ్యలో పెద్దపల్లి రైల్వేస్టేషన్‌కు సమీపంలో సోమవారం జారిపడటంతో చనిపోయాడని రైల్వే హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తెలిపారు. మృతుడి తండ్రి జగదీశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కలాం–2023 జాతీయ అవార్డుకు ఎంపిక



యాదవరాజు

గోదావరిఖని టౌన్: నేషనల్ యూత్ ప్రాజెక్టు రాష్ట్ర అధ్యక్షుడు యాదవరాజు కలాం–2023 జాతీయ అవార్డుకు ఎంపికయ్యారు. కలాం వర్ధంతి సందర్భంగా ఈ నెల 27న ఢిల్లీ విశ్వ యువ కేంద్రంలో జరిగే అంతర్జాతీయ యువజన సమ్మేళనంలో ఆయన అవార్డు అందుకోనున్నారు. స్థానిక అడ్డగుంటపల్లికి చెందిన యాదవరాజు 33 ఏళ్లుగా విద్యార్థులకు అనేక శిబిరాలు నిర్వహిస్తూ మహాత్మాగాంధీ, వివేకానందుడు వంటి మహోన్నతుల జీవిత ఆదర్శాలు, లక్ష్యాలపై అవగాహన కల్పిస్తున్నారు.

అమలుకు నోచుకోని ప్రభుత్వ హామీలు

- ఎన్నికలు వస్తుండటంతో తెరమీదకు బీసీ బంధు పథకం
- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

గంగాధర: ప్రభుత్వ హామీలు అమలుకు నోచుకోవడం లేదని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆరోపించారు. గంగాధర మండలంలోని మధురానగర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకుడు వొడ్నాల యగ్నేశ్ ఆధ్వర్యంలో, టీపీసీసీ అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇన్‌చార్జి మేడిపల్లి సత్యం సమక్షంలో సోమవారం పలువురు యువకులు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడారు. రైతులకు చేస్తామన్న రూ.లక్ష రుణమాఫీ ఐదేళ్లు కావస్తున్నా పూర్తి కాలేదన్నారు. మద్దతు ధరతో ధాన్యం కొంటామని క్వింటాల్‌కు 10 కిలోలు దోచుకుంటున్నారని, రైతుబంధు పేరు చెప్పి, రైతుల సబ్సిడీలకు ఎగనామం పెట్టారని మండిపడ్డారు. 1.91 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయడం లేదని, నిరుద్యోగ భృతి ఇవ్వడం లేదన్నారు. టీఎస్‌పీఎస్సీ అవినీతిమయం అయిందన్నారు. డబుల్ బెడ్రూం ఇళ్లు పంపిణీ చేసింది లేదని, ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షలు ఇస్తామని ఏడాది గడిచినా ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ప్రస్తుతం ఎన్నికలు వస్తుండటంతో బీసీ బంధు పథకాన్ని తెరమీదకు తెచ్చారన్నారు. మేడిపల్లి సత్యం మాట్లాడుతూ.. తాను రెండుసార్లు ఇక్కడి నుంచి పోటీ చేసి, ఓడిపోయినా ప్రజలు, రైతుల సమస్యలపై పోరాటం చేస్తున్నానని అన్నారు. నాపై గెలిచిన బొడిగ శోభ, సుంకె రవిశంకర్‌లు ధనార్జనే ధ్యేయంగా పని చేశారని ఆరోపించారు. ఈసారి ఎన్నికల్లో తనను దీవిస్తే ప్రజాసేవకు అంకితమవుతానని పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ కవితను అరెస్టు చేయరెందుకు?

ధర్మారం: సీఎం కేసీఆర్‌తోపాటు ఆయన కుటుంబం అక్రమ సంపాదనపై కేంద్రం వెంటనే దర్యాప్తు జరిపించాలని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ నగేశ్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన ధర్మారంలో మాట్లాడారు. లిక్కర్ స్కాంలో ఎమ్మెల్సీ కవితను ఎందుకు అరెస్టు చేయటం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై ఈడీ, సీబీఐలతో దర్యాప్తు చేయించేందుకు కేంద్ర ప్రభుత్వం వెనకడుగు వేస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీ కలిసి పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నాయన్న అనుమానం కలుగుతోందని తెలిపారు. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ బరిలో బీజేపీ ఎంపీ కిషన్‌రెడ్డిపై బీఆర్ఎస్ అనామకుడిని పోటీలో దింపింది నిజం కాదా అని ప్రశ్నించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్ష కూటమి ఏర్పాటు చేసిన సమావేశానికి బీఆర్ఎస్ ఎందుకు హాజరు కాలేదో చెప్పాలన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు న్యాయం చేయండి

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియాలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు న్యాయం చేయాలని ఐఎఫ్‌టీయూ నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం ఆర్జీ–2 పర్సనల్ మేనేజర్ రాజేంద్రప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. కార్మికులు తమ ఆరోగ్యం బాగాలేక విధులకు హాజరు కాకపోతే కాంట్రాక్టర్లు వారి జీతం నుంచి ఒక రోజుకు రూ.300 చొప్పున కోత విధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పండుగలకు సెలవులు ఇవ్వకపోగా చేసిన పనులకు డబుల్ మాస్టర్లు ఇవ్వడం లేదన్నారు. ఇప్పటికైనా సింగరేణి యాజమాన్యం స్పందించి, కాంట్రాక్టు కార్మికుల జీతం నుంచి రికవరీ చేయకుండా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్, నాయకులు రాజనర్సు, గట్టయ్య, పద్మ, బుచ్చమ్మ, రాజేశ్వరి, తదితరులున్నారు.

జల్సాలకు అలవాటు పడి చోరీలు

కరీంనగర్‌క్రైం: జల్సాలకు అలవాటుపడి, దొంగతనాలు చేస్తున్న ఇద్దరిని కరీంనగర్ వన్ టౌన్ పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఏసీపీ తుల శ్రీనివాసరావు వన్‌టౌన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కొత్తపెల్లి మండలంలోని రేకుర్తి విజయపురి కాలనీకి చెందిన కుంచం అశోక్, అతని తమ్ముడు రవి జల్సాలకు అలవాటు పడ్డారు. సులువుగా డబ్బు సంపాదించేందుకు చోరీలు చేయాలనుకున్నారు. కరీంనగర్‌లో తాళం వేసి ఉన్న పలు ఇళ్లకు కన్నం వేసి, బంగారు, వెండి ఆభరణాలు, నగదు దొంగిలించారు. వరుస చోరీ ఘటనలను సవాల్‌గా తీసుకున్న పోలీసులు వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఆ దొంగల కదలికలపై దృష్టిపెట్టి, సోమవారం చాకచక్యంగా పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.5.40 లక్షల విలువైన ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. దొంగలను పట్టుకున్న పోలీసులను ఏసీపీ అభినందించారు.